# మేల్ కాంప్లెక్స్

"అవంతీ" పిలిచాను ఆనందంగా.

నాముందు కొదిదూరంలో నడుస్తున్న అవంతి ఆగి వెనక్కి తిరిగి చూసింది. అవంతి ప్రక్కనవున్న వ్యక్తి కూడా నావంక చూసాడు.

"బి.ఏలో ఇది నాక్లాస్‌మేట్ మా ఇంట్లోనే అద్దెకి వుండే వాళ్ళు" పరిచయంచేసింది ఆయనకి.

"యం.ఏలో కూడా" చెప్పాను.

ఆయన ఏదో అనబోయాడు. కాని అవంతి చెప్పింది.

"మా ఆయన ప్లాస్టిక్స్ అండ్ ప్లాస్టిక్స్‌లో స్టెనో గ్రాఫర్"

ముగ్గురం చర్చ్‌గేట్ నుంచి ఫ్లోరాఫౌంటెన్ వైపు నడుస్తున్నాం.

జోసెఫిన్ రీడర్‌గా చేస్తుంది వైజాగ్‌లో. వాసంతి స్టేట్స్‌కి వెళ్ళింది....

మా క్లాస్‌మేట్స్‌ను గురించి చెప్పసాగాను.

అవంతి చప్పున అంది.

"నీ ఇంటి అడ్రస్ రాసివ్వవే. ఆదివారం వస్తాం"

అవంతి మొగుడు జేబులోంచి సిగరెట్ పెట్టెతీసి, లోపలనుంచి తగరంతీసి అందించాడు. తగరానికి వెనుకవైపు రాసాను, బైకుల్లాలోని ఇంటి చిరునామా.

"కాఫీ తాగుదాం, చాలాకాలానికి కనపడ్డ పేగా నీ స్నేహితురాలు" అన్నాడు అవంతి భర్త.

"మనింటికి పిలుద్దాం, భోజనానికే వచ్చేస్తుంది" అన్నది అవంతి

రెండు నిమిషాల తర్వాత గుడ్‌బై చెప్పి విడిపోయాను.

* * *

నాలుగు రోజుల తర్వాత యూనివర్సిటీ నుంచి ఇంటికి రాగానే నా పేర ఓ కవరు వచ్చింది. నా ట్రాన్సిస్టర్ కింద పెట్టారు పిల్లలు. అమ్మ తప్ప ఇంకెవరూ రాయరునాకు

ఆ కవరు మీది చేతివ్రాతని గుర్తుపట్టలేదు నేను. కవరుమీద అవంతి, బొంబే అని రాసివుండటంతో అది రాసిన వుత్తరం అని తెలిసింది విప్పకుండానే.

బాత్ రూంలోకివెళ్ళి చన్నీళ్ళతో మొహం కడుక్కుని వేడివేడికాఫీ తాగాక కవరు చింపాను.

ఆదివారం వస్తున్నావనో లేదా ఏదో కారణంవల్ల రావటంలేదనో రాస్తుందనుకున్నాను బొంబేలో ఒకళ్ళింటికి వెళ్ళబోయేముందు వుత్తరం ద్వారా అలా తెలియబరచడం చాలామంది అలవాటు. దూరం ఎక్కువ కాబట్టి తీరావెళితే శలవు దినం ఫ్లాట్ తలుపు తాళంవేసి వుంటుంది. ఒకాకే స్తుంది, కాబట్టి ముందర వుత్తరం రాస్తారు.

అవంతి రాసిన విషయం వేరు.

డియర్ ఆర్.వి

నువ్వుకనబడితే చాలా సంతోషం వేసింది. కాని నిన్ను అట్టే మాట్లాడనివ్వలేదు మావారు. కాఫీకి పిలిచినా ఏదో చెప్పి పంపేసాను. నీ దగ్గర అప్పుతీసుకుని చాలా కాలానికి కనబడితే అడెక్కడ అడుగుతావో అని వదిలించుకుని పారిపోయినట్లుగా పారిపోయాను కదూ?

దానికి కారణం వుంది.

నీకు విశేషాలు తెలియవు కాబట్టి, నేను యం.ఏ పాస్ అయానని ఎక్కడ మాటల్లో అంటావో, మా వారికి ఆ సంగతి తెలిసి పోతుందేమో నని భయంతో అలా ప్రవర్తించాను.

దయచేసి ఎప్పుడూ_రిపీట్_ఎప్పుడూ మా వారికి నేను పోస్టు గ్రాడ్యుయేట్‌నని తెలియనివ్వకు ఆయనకి ఆ సంగతి తెలియదు కేవలం బి ఏ మాత్రమే పాస్ అయ్యానని ఆయన అనుకుంటున్నారు. అలా అని అబద్ధంచెప్పి ఈ పెళ్ళి చేసారు మావాళ్ళు ఆయన బి ఎస్సి పాసయ్యారు. నాలాగా పి.జి కాదు, మంచి సంబంధం అని, కట్నం తక్కువలో పోతుందనీ అలా చేసారు మావాళ్ళు. నేను తనకన్నా ఎక్కువ చదువుకున్నానని తెలిస్తే ఆయన బాధపడతారు. అందులో ఇంతకాలం దాచానని తెలిస్తే ఇంకా బాధపడతారు. చాలా సెన్సిటివ్ ఆయన, దూరంగా బొంబేలో వుంటున్నాంకాబట్టి తెలిసే అవకాశం వుండదని నేనూ వప్పుకున్నాను. దయచేసి ఈ లెటర్ చదివాక చింపేసెయ్ వచ్చే ఆదివారం ఇద్దరం టీకి వస్తున్నాం. సాయంత్రం నాలుగింటికి

యువర్స్ సిన్సియర్లీ

అవంతి

ఆ ఉత్తరం చింపసాగాను వెంటనే.